andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 కనిష్ఠం 25.9

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్ జిల్లా వార్తలు

5 గురువారం 19 జూన్ 2025

రేపు నగరంలో ఒలంపిక్ రన్

సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒలంపిక్ రన్‌ను నిర్వహించనున్నామని అధ్యక్ష, కార్యదర్శులు ఈగ సంజీవ్‌రెడ్డి, బొబ్బిలి నర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి పాత కలెక్టరేట్ క్రీడా మైదానం వరకు ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30లకు ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద పోలీసు కమిషనర్ సాయిచైతన్య ప్రారంభిస్తారని, ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

మనో సంకల్పంతో అంగవైకల్యాన్ని జయించాలి

దివ్యాంగుల బడిబాట కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం ఉన్న విద్యార్థులలో తల్లిదండ్రులలో మనోధైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన దివ్యాంగుల బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరానికి ఉన్న అంగవైకల్యాన్ని మనో సంకల్పంతో జయిం టచి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి అంగవైకల్యం ఉన్న విద్యార్థులకు సదరం క్యాంప్ ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో పాటు తన సొంత ట్రస్ట్ ద్వారా ఎల్లప్పుడూ స్నేహ సొసైటీకి, దివ్యాంగులకు అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా స్నేహసొసైటీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ చైర్మన్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, సీడీపీవో సౌందర్య, వీరేశం, బాబాగౌడ్ పాల్గొన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల

- నిజామాబాద్, బోధన్ పట్టణాలకు అందనున్న తాగునీరు
- మూడు రోజుల పాటు 0.35 టీఎంసీల నీటి విడుదల
- ప్రస్తుతం నిజాంసాగర్‌లో 6.032 టీఎంసీల నీటి నిల్వలు
- వర్షాకాలం ప్రణాళిక ఖరారు చేయని అధికార యంత్రాంగం

7

ఉపాధిలో మహిళలదే అగ్రస్థానం

- కూలీ ధరలు పెరగడంతో మహిళల్లో పెరిగిన ఉత్సాహం
- 2023-24లో ఎక్కువ పని రోజులు వారివే

7

నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాలలో

మెరుగుపడిన ఉత్తీర్ణత శాతం

- నిల్ రిజల్ట్ నుంచి 40 శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాల



ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల మూత్రశాల





నిర్మాణంలో ఉన్న బాత్‌రూమ్

ఒంటికి.. రెంటికి బయటకే!

- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇక్కట్లు
- నిలిచిపోయిన మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
- బిల్లులు రాక పనులను మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్లు
- సుమోటాగా కేసు నమోదు చేసిన మానవ హక్కుల కమిషన్

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒంటికి, రెంటికి వస్తే ఇంటికి వెళ్లవల్సిన దుస్థితి ఉంది. విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలకు వస్తుండగా మధ్యలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి పాఠశాలల్లో సరైన వసతులు లేక దగ్గరలో ఉన్న ఇంటికి వెళ్లే పరిస్థితి నెలకొంది. కొంత మంది విద్యార్థులు ఒంటికి, రెంటికి ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలలకు రావడం లేదు. బాలికల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు సరైన బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల ఒక్కటే బాత్‌రూమ్ వందలాది మంది విద్యార్థులకు ఉండటంతో వాటిని శుభ్రపరిచే వారు లేక కంపు కొడుతున్నాయి. ఇదే విషయమై మానవ హక్కుల కమిషన్ సుమటోగా స్వీకరించి జూలై 28లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు లేక పాఠశాలలకు విద్యార్థులు వచ్చేందుకు బయపడుతున్నారు. ఇటీవల జరిగిన బడి బాట కార్యక్రమంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు ఉంటేనే పిల్లలను పంపుతామని తల్లిదండ్రులు చాలా చోట్ల ఉపాధ్యాయులకు కరాఖండీగా చెప్పినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడం బాత్‌రూమ్‌లను, మరుగుదొడ్లను శుభ్రం చేసేవారు లేక విద్యార్థులు వాటిలోకి వెళ్లేందుకు బయపడే పరిస్థితులు ఉన్నాయి. నిజామాబాద్ మండలం సారంగపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో రెండింటిలో కలిపి సుమారు 500 మంది విద్యార్థులు ఉండగా హైస్కూల్‌లో ఒక్కటే మరుగుదొడ్డిని బాలికలతో పాటు ఉపాధ్యాయులు వినియోగిస్తున్నారు. బాలురు అయితే కాలకృత్యాలకు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నత పాఠశాలకు మన ఊరు మన బడి కింద 2022లో 36లక్షలు పాఠశాల మరమ్మతులకు మంజూరు కాగా కాంట్రాక్టర్ బాత్‌రూమ్‌లను కూల్చేసి కొత్తవాటిని నిర్మించేందుకు స్లాబ్ వేసి వదిలేశాడు. ఆ ప్రభుత్వం మారగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద టాయిలెట్లు, మంచినీటి సౌకర్యం కోసం రూ.11లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే కాంట్రాక్టర్‌కు 2లక్షల 30వేలు చెల్లించినప్పటికీ ఇంకా పనులు పూర్తి కాలేదు. ప్రాథమిక పాఠశాల ఒక యూనిట్ బాత్‌రూమ్‌ల నిర్మాణానికి 5లక్షల 80వేలు మంజూరు కాగా అందులో 10 శాతం కాంట్రాక్టర్‌కు చెల్లించారు. అయినప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్లు సైతం పనులను మధ్యలోనే ఆపివేయడంతో చాలా పాఠశాలల్లో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

45 పాఠశాలల్లో టాయిలెట్లు లేవు..

అన్ని రంగాల్లో మహిళలకు సమప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్న ప్రభుత్వాలు చేతల్లో మాత్రం బాలికల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికీ 45 పాఠశాలల్లో బాలికలకు టాయి లెట్లు లేవంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బాలురతో పోలిస్తే బాలికలకు మూత్రశాలలకు వెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితులే ఉంటాయి. బాలురు బహిరంగ ప్రదేశాలకు వెళ్లే అవకాశం ఉన్నా బాలికలు మాత్రం ఖచ్చితంగా మూత్రశా లలకు వెళ్లాల్సిందే. కానీ జిల్లాలో చాలాచోట్ల మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల దగ్గరగా ఉన్నవారు ఒంటికి, రెంటికి వచ్చినప్పుడు ఇంటికి వెళ్తున్నారు. దీంతో చదువు మధ్య మధ్యలో ఆటంకాలు ఏర్పడి చదువుపై శ్రద్ధ పెట్టడం లేదు. కొంత మంది బాలికలు అయితే మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో చదువును ఆపేసే పరిస్థితులు కూడా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్నాయి.



500 మంది విద్యార్థులకు ఒక్కటే మరుగుదొడ్డి..

జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సారంగపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల,

మిగతా 8వ పేజీలో...



టోల్ చార్జీల పేరిట ఆర్టీసీ బాదుడు!

- ఒక్కో టోల్‌కు రూ.10 పెంపు
- ఎక్స్‌ప్రెస్‌లోనూ రేషనలైజేషన్ పేరిట బాదుడు
- హైదరాబాద్‌కు టిక్కెట్‌పై రూ.30 పెంపు
- ప్రయాణికుల నడ్డి విరుస్తున్న టిక్కెట్ల పెంపు నిర్ణయం
- ఆందోళనలో ఆర్టీసీ ప్రయాణికులు

సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా టోల్ ట్యాక్స్ పెంచిందనే సాకుతో ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులపై భారం మోపుతోంది. వారం రోజుల నుంచి టోల్ ట్యాక్స్ పెరిగిందని ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటికే మహాలక్ష్మి పథకంతో కుదేలవుతున్న ఆర్టీసీని కాపాడుకునే ప్రయత్నంలోనే సంస్థ టికెట్లను పెంచినట్లు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి పురుషులకు టికెట్ ధరలను పెంచడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్‌గేట్ చార్జీ పెంచారని ప్రయాణికుల మీద భారం మోపడం సరైంది కాదని, టికెట్ ధర యథావిధిగా ఉంచేలా చూడాలని కోరుతున్నారు. ఒక్కో టోల్ ట్యాక్స్ దాటిలో 10రూపాయల చొప్పున ఎక్స్‌ట్రా బస్ చార్జీని సంస్థ వసూలు చేస్తోంది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే మూడు టోల్ గేట్‌లు ఉండడంతో ఒక్క టికెట్‌పై రూ.30 చార్జీ పెరిగింది. అంతేకాకుండా టికెట్ రేషనలైజేషన్ పేరుమీద అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో టికెట్ ధరను పది రూపాయలు పెంచింది. జిల్లాలోని ప్రధాన రూట్లలో ఎక్స్‌ప్రెస్‌లు ప్రయాణించే రూట్లలో ఒక్కో టికెట్ పై పది రూపాయలు పెంచారు. గతంలో 40రూపాయల టికెట్ ధర ఉంటే అమాంతం 50రూపాయలకు పెంచే శారు.

రేషనలైజేషన్ పేరుతో టికెట్ ధర పెంపు

కిలో మీటర్లలో వ్యత్యాసం ఉందని రేషనలైజేషన్ పేరుతో టికెట్ దరను ఆర్టీసీ యాజమాన్యం పెంచింది. నిజామాబాద్ రీజియన్‌లోని బాన్సువాడ, కామారెడ్డి, బోధన్, నందిపేట్, నిర్మల్ తదితర రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం బస్ టికెట్‌పై పది రూపాయలను పెంచింది. గతంలోనే రౌండ్ ఫిగర్ పేరుమీద టికెట్ ధర పెంచిన ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం రేషనలైజేషన్ పేరుమీద టికెట్ ధర పెంచి ప్రయాణికులపై భారం మోపుతుంది. ఎలాంటి గుట్టు చప్పుడు కాకుండా ఆర్టీసీ సంస్థ టికెట్ ధరలను పెంచింది. ప్రయాణికులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే టిమ్స్, ఛలో మిషన్ల ద్వారా టికెట్‌లను జారీ చేస్తుంది. ప్రయాణికులు ఎదురుతిరిగితే తమకేమీ తెలియదని కండక్టర్లు చెబుతున్నారు. గతంలో టికెట్‌లు పెంచితే ఆర్టీసీ ఉన్నతాధికారులు ముందస్తుగా ప్రజలకు సమాచారం వివిధ రూపాల్లో తెలియజేసే వారు. కానీ ప్రస్తుతం ఎలాంటి సమాచారం లేకుండా టికెట్ ధరలను పెంచారు. టికెట్‌ల రేట్లు పెంచడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రయాణికులకు కండక్టర్లకు మధ్య టికెట్‌ల రేట్ల పెంపుపై వాగ్వాదం చోటు చేసుకుటుంది. ఎలాంటి సమాచారం లేకుండా టికెట్ రేట్లు ఎలా పెంచుతారని ప్రయాణికులకు ప్రశ్నిస్తున్నారు.

టోల్ పెంపు సాకుతో సంస్థ బాదుడు

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా టోల్ గేట్ చార్జీలను పెంచిందనే సాకుతో ఆర్టీసీ టికెట్ ధరలను పెంచేసేంది. ఒక్కో టోల్‌గేట్ దాటిన పది రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. హైదరాబాద్‌కు వెళ్లాలంటే మూడు టోల్‌గేట్లను దాటాల్సి ఉంటుంది. దీంతో 30రూపాయలు అదనంగా ప్రయాణికుల వద్ద నుంచి ఆర్టీసీ వసూలు చేస్తోంది. గతంలో ఏసీ బస్సుల్లో 430రూపాయలు చార్జీ వసూలు చేస్తుండగా ప్రస్తుతం టోల్ పేరిట అదనంగా 30రూపాయలు వసూలు చేసి మొత్తంగా 460రూపాయలను చార్జీ చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ లగ్జరీ బస్సుల్లో సైతం అదనంగా 30 రూపాయలు చేస్తున్నారు. ఆర్టీసీ చార్జీల పెంపు పురుషులపై భారం పడనుంది. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఫ్రీగా ఉండటంతో పురుషులపై చార్జీల పెంపు భారం పడనుంది. మహాలక్ష్మి పథకంపై ఇప్పటికే పురుషులు వ్యతిరేకత ఉండటం చార్జీల పెంపు పురుషులపై భారం పడనుండటంతో మరింత వ్యతిరేకత రానుంది.

చార్జీలు పెంచడం దారుణం..

: షఫీ, నందిపేట్ వాసి

ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో చార్జీలు పెంచడం దారుణం. ఇప్పటికే ఆర్టీసీలో ప్రయాణం చాలా కష్టమైంది. మహాలక్ష్మి పథకంతో రద్దీగా ఉండటంతో ఇతర ప్రయాణాలను ఎంచుకుంటున్నాం. చార్జీలు కూడా పెరిగితే ప్రయాణాలు ఇతర మార్గాల ద్వారా ఎంచుకునే పరిస్థితి ఏర్పడుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సులోనే ప్రయాణిస్తున్న చార్జీల పెంపుతో ఆర్టీసీలో ప్రయాణించాలా అనేది ఆలోచించాల్సి వస్తుంది. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలి.

టోల్ పెంచడం వల్ల చార్జీల పెంపు..

జ్యోత్స్న, ఆర్టీసీ ఆర్‌ఎం, నిజామాబాద్



నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా టోల్ టాక్సులను పెంచడం వల్లే ఆర్టీసీ చార్జీలను పెంచాము. టోల్ ఏరియాలోని 10 రూపాయల చార్జీని అదనంగా వసూళ్లు చేస్తున్నాం. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కిలో మీటర్ల తేడా వల్ల అదనపు చార్జీని వసూలు చేయడం జరుగుతుంది. గత మూడు సంవత్సరాలుగా ఆర్టీసీలో చార్జీలు పెంచలేదు. ఆర్టీసీ ప్రయాణికులు సహకరించి అభివృద్ధికి తోడ్పడాలి.

వన మహోత్సవం లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

- కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమీక్ష సమావేశానికి హాజరైన అధికారులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం అదనపు కలెక్టర్‌లు కిరణ్ కుమార్, అంకిత్, డీఎఫ్‌వో వికాస్‌మీనాలతో కలిసి సమీక్షించారు. ప్రధానంగా 2025-26 వార్షిక సంవత్సరానికి ఆయా శాఖల వారీగా వన మహోత్సవం కింద నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించారు. ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 545 గ్రామపంచాయతీలు, 4 మున్సిపల్ పట్టణాల్లో మొక్కలను నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. వన మహోత్సవంను ప్రాధాన్యత అంశంగా భావిస్తూ గడువులోపు లక్ష్యం పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లతో సన్నద్ధమై ఉండాలని మండల ప్రత్యేక అధికారులతో పాటు సూపర్‌వైజరీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా నర్సరీలను, వైకుంఠధామాలను, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాలన్నారు. నాటిన మొక్కల స్థితిగతులను తప్పనిసరిగా పరిశీలన చేయాలని వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలను అందజేయాలన్నారు. అటవీ శాఖ అధికారులు సైతం గ్రామ పంచాయతీలను విధిగా సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చించి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అప్పుడే వన మహోత్సవం లక్ష్యం సిద్ధిస్తుందన్నారు. కేవలం గుంతలు తవ్వి మొక్కలు నాటి వాటికి నీరు అందించడంతోనే సరిపెట్టకుండా ఫెన్సింగ్, సాసరింగ్ చేసి వాటిని సంరక్షించాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి..

జిల్లాలో చేపట్టే రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి అనవసర జాప్యానికి తావులేకుండా భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసి వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్ల విస్తరణ, రైల్వే పనులు, నీటిపారుదల, జాతీయ రహదారులు, పరిశ్రమల స్థాపన తదితర వాటికి సంబంధించి అవసరమైన భూసేకరణపై సంబంధిత అధికారులతో శాఖల వారిగా సమీక్షించారు. నిర్దేశిత పనుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో సంప్రదింపులు జరుపుతూ నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ భూసేకరణపై పెండింగ్‌లో ఉన్న అప్పీల్‌లను వేగంగా పరిష్కరించాలని అన్నారు. వారం అనంతరం భూసేకరణపై మళ్లీ సమీక్ష చేస్తామని స్పష్టమైన ప్రగతి కనిపించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్ ఆర్‌డీవో రాజాగౌడ్, మెప్మా పీడీ రాజేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



- మూడేళ్ల నుంచి ఎల్‌టీ రుణాలు రాక ఇబ్బందులు
- నిధులను మళ్లించి కల్యాణ మండపం, గోదాంల నిర్మాణం
- జిల్లా సహకార బ్యాంకుకు రూ.3 కోట్ల బకాయిలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మోపాల్ సొసైటీలో ఇష్టారాజ్యం!

మోపాల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మోపాల్ ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఉన్న రైతులకు మూడు సంవత్సరాల నుంచి ఎల్‌టీ రుణాలు రాకపోవడంతో ఈ సొసైటీ పరిధిలో ఉన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 15-20 సంవత్సరాల క్రితం ఉన్న పాలకులు జిల్లా సహకార బ్యాంకు నుంచి ఎల్‌టీ రుణాల కింద సుమారు 50లక్షల రూపాయలను తీసుకుంటే ఇప్పుడు వడ్డీతో సహా 3 కోట్ల రూపాయలు బకాయిలు పడ్డారు. ఇదిలా ఉండగా రైతులు తీసుకున్న ఎల్‌టీ రుణాలు సుమారుగా 2కోట్ల వరకు తిరిగి కట్టేశారు. ఈ డబ్బులను మోపాల్ సొసైటీ బ్యాంకు పాలక వర్గం డబ్బులను జిల్లా సహకార బ్యాంకుకు కట్టకపోగా ఈ డబ్బులను సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్యాణ మండపంకు 80లక్షలు, కంజర్, ముల్లంగి, న్యాల్‌కల్ గ్రామాల్లో నిర్మించిన గోదాంలకు డబ్బులను ఖర్చు చేశారని ప్రచారం జరుగుతోంది. మరికొంత మంది డైరెక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చర్చనీయాంశమైంది. డైరెక్టర్లు సొసైటీ నుంచి ఎరువులు, యూరియా తీసుకెళ్లి డబ్బులు సకాలంలో కట్టకపోవడంతో సుమారు 7లక్షల వరకు బకాయిలు పడ్డారు. వారిపై అధికారులు ఒత్తిడిని తెచ్చినా కట్టలేకపోతున్నారు. కొత్తగా వచ్చిన చైర్మన్ గంగారెడ్డి, పీవో సాయి ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎవరైతే సొసైటీకి బాకీ ఉన్నారో డైరెక్టర్లు డబ్బులు కట్టవల్సిందేనని పట్టుబడినట్లు సమాచారం. సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన కమీషన్‌ను జిల్లా సహకార బ్యాంకుకు ప్రతీ సంవత్సరం డబ్బులను పట్టుకోవడంతో సొసైటీలో పనిచేసే ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వడం కష్టమవుతుందని చైర్మన్ గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన

మిగతా 8వ పేజీలో...

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉండాలి


వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు



ధర్పల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆర్మూర్ రూరల్ , జూన్18 (ఆంధ్రజ్యోతి): వర్షకాలం ప్రారంభంలో సోకే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగి వుండాలని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ అయేషా, హెల్త్ ఆఫీసర్ హకీల్, ఎంపీడీవో గంగాధర్ అన్నారు. ఆలూర్ మండల కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా,డెంగ్యూ, ఫైలేరియా, చికెన్‌గున్య, టైఫాయిడ్ కేసుల పట్ల జాగ్రత్తగా ఉండాని అన్నారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శులు రాజలింగం, నసీర్, శ్రీనివాస్,కిషోర్, శేఖర్, దినేష్ పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బాలాజీ రావ్ మాట్లాడుతూ తుమ్ములు, దగ్గు వచ్చినప్పుడు దస్తీ, లేదా మాస్క్ పెట్టుకోవాలని జ్వరం వచ్చినట్టు అనిపించినా వెంటనే వైద్యున్ని సంప్రదించాలని తెలిసి, తెలియని మాత్రలు వాడి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్పల్లి: సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో వివిధ అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమా వే శాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మలేరియా వైద్యాధికారి, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి తుకారాం రాథోడ్ హాజరయ్యారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలన్నారు. గ్రామస్థాయి అధికారులు నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ ను క్రమం తప్పకుండా చేయాలని పారిశుద్ధ్య పనులువేగవంతం చేయాల న్నారు. మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవంపై సమీక్షిం చారు. ఐసీడీఎస్, ఐకేపీ, ఈజీఎస్ పనులపై సమీక్షించారు. రాబోయే వారం రోజుల్లో చేపట్టే వన మహోత్సవ కార్యక్రమానికి సంసిద్ధంగా ఉండా లని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శాంతా, ఎంపీవో రాజేష్, ఏఈ పీఆర్ బాలాజీ, హౌజింగ్ ఏఈ అనూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, సరిత, ఏపీవో వినోద, ఏపీఎం సునీత, ఈసీ సంజీవ్, పంచాయతీరాజ్ కార్య దర్శులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ నియామకం


పొతంగల్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై వినయ్

నవీపేట,జూన్18(ఆంధ్రజ్యోతి): విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగంగా ప్రతి గ్రామానికి ఒక విలేజ్ పోలీస్ ఆఫీసర్ నియామకం చేపట్టడం జరిగిందని ఎస్ఐ వినయ్ అన్నారు. బుధవారం మండలంలోని పొతంగల్‌లో నిర్వహించిన ప్రజల వద్దకే పోలీస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశం మేరకు ఇక నుండి ప్రతి రోజు ఉదయం ఒక గ్రామాన్ని పోలీసులు సందర్శించడం జరుగుతుందని అన్నారు. ఏదైన ఆపద ఉంటే పోలీస్ స్టేషన్‌కు నిర్భయంగా వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రోల్ కాల్ నిర్వహించి గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మోహన్ రెడ్డి, ఎస్‌కే బాబు తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్


విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్,జూన్18(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం బోధన్ ఏసీపీ కార్యాలయంలో ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు రోజురోజుకు పెరుగుతున్నాయని దొంగతనాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దొంగతనాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆయా గ్రామాలలో, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో సీసీ కెమెరాలు ఉంటే వెంటనే వాటిని పరిశీలించి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాల వల్ల రైతులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశానుసారం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కావున అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల సమాచారంతో అధికారులతో అప్రమత్తంగా ఉండి ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ హైమద్, టౌన్ ఏఈ కృష్ణ, రూరల్ సీఐ విజయ్ బాబు, టౌన్ సీఐ వెంకట నారాయణ, డివిజన్ స్థాయి ఎస్ఐలు, ట్రాన్స్‌కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులపై కేసులను ఎత్తివేయాలి


ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని బుధవారం ఆర్టీసీ ఉద్యోగులు విన్నవించారు. బుధవారం బోధన్ కోర్టు న్యాయస్థానానికి వారు హాజరయ్యారు. అనంతరం కోర్టు బయట వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు కోరారు. ఏళ్లకాలంగా తమపై పెట్టిన కేసులు కొనసాగుతుండడంతో పలుమార్లు న్యాయస్థానానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. తమపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరారు.

మంగల్‌పాడ్‌లో వివాహిత అదృశ్యం


మోక్షిత (ఫైల్)

ఎడపల్లి, జూన్18(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన బంజ మోక్షిత(25) అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన బంజ మోక్షిత అనే వివాహిత మహిళ ఈ నెల 13వ తేదీన తన ఇంటి నుండి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిందని బంధువుల ఇళ్లలో వెతకగా అచూకీ లభించక పోవడంతో అదృశ్యమైన మహిళ భర్త బంజ మోహన్ బుధవారం ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

కోటగిరి,జూన్18(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రానికి సూదం గంగామణి(52)అనే వివాహిత చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. గంగామణి భర్త సాయిలు మందలించడంతో మనస్థాపానికి గురైన గంగామణి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయి పొతంగల్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తనయుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వీరన్న గుట్టలో వివాహిత ఆత్మహత్య

రెంజల్,జూన్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన భువనేశ్వరి(40)అనే మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వీరన్నగుట్ట గ్రామానికి చెందిన భువనేశ్వరికి గత కొన్ని సంవత్సరాల నుండి మానసిక స్థితి బాగా లేకపోవడంతో మంగళవారం సాయంత్రం వేళలో బాత్‌రూమ్‌లోని ఇనుప పైపుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో భర్త శంకర్ మరికొంత మందితో కలిసి ఆమెను బయటకు తీసి చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించే లోపు మార్గమధ్యంలో మృతి చెందిందని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

ఇందల్వాయి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా నేటి యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సందీప్ సూచించారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మోసపోవద్దని అన్నారు. చదువుపై దృష్టిపెట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాదురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్షక మిత్రకు కమీషన్లు

● మందు, మాంసంతో విందులు ఇచ్చిన రైతులకే రుణాలు మంజూరు ?
● హెడ్ ఆఫీస్‌కు ఫైల్ పంపాలంటే కమిషన్లు ఇవ్వాల్సిందే
● ఇన్‌చార్జి బ్యాంకు మేనేజర్ ఫీల్డ్ ఆఫీసర్ వసూళ్ల పర్వం


జుక్కల్ ఎన్‌డీసీసీ బ్యాంకు

జుక్కల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ ఎన్డీసీసీ బ్యాంక్ ఇంచార్జి మేనేజర్ ఫీల్డ్ ఆఫీసర్ ఇద్దరు కలిసి కర్షక మిత్ర రుణాలు మంజూరు కావాలంటే కమిషన్లు ఇవ్వాల్సిందేనని రైతులకు పరోక్షంగా ఆదేశిస్తున్నారు. జుక్కల్ మండలంలో అమాయక రైతులను ఆసరా చేసుకొని బ్యాంక్ అధికారులు రుణాలు తీసుకుంటున్న రైతుల వద్ద సుమారు 20 వేల వరకు కమిషన్లు పొందుతున్నట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా రైతులు ఒకరితో మరొకరు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఎన్‌డిసిసి బ్యాంక్ ఉన్నతాధికారులు రైతులను అభివృద్ధి చేయడానికి నా బార్డు నిధులతో పంట పొలాలు ఉన్న రైతులను గుర్తించి తక్కువ వడ్డీ శాతంతో కర్షక మిత్ర రుణాలు మంజూరు చేస్తుంది. ఎకరం భూమికి 250000 రూపాయలు చొప్పున రైతుల భూమి విస్తీర్ణం ప్రకారం 12 లక్షలు వరకు రుణాలు ఇవ్వాలని బ్యాంక్ అధికారుల నిబంధన ఉంది. 12 శాతం వడ్డీతో రైతులకు రుణాలు ఇచ్చి రైతుకు చెందిన పట్టా భూమిని బ్యాంక్ పేరు పై మా ర్ డికేస్ చేసుకొని రైతులకు రుణాలు మంజూరు చేసి రైతులకు రుణాలు పంపిణీ చేయాలి ఇట్టి అవకాశాన్ని బ్యాంక్ అధికారులు ఆసరా చేసుకుని మందు మాంసం విందు భోజనాలు ఇచ్చిన వారికి రుణాల ఫైలు ఉన్నతాధికారులకు పంపించి మంజూరు చేసి రైతులకు కర్షక మిత్ర రుణాలు పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా బ్యాంకు ఉన్నతాధికారులకు ఖర్చులు ఉంటాయని పేరు చెప్పి ఫైల్ మంజూరుకు సుమారు ప్రతి రైతు దగ్గర 20,000 వేల వరకు బ్యాంక్ అధికారులు కమిషన్లు తీసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇచ్చిన రైతులకి హెడ్ ఆఫీస్‌కు ఫైలు పంపించి 15 రోజులు లోపు రుణాలు మంజూరు చేసి డబ్బులు చెల్లిస్తున్నారు. కమిషన్లు ఇవ్వని రైతులకు కుంటి సాకులు చెబుతూ కాకి కథలు చెబుతూ రుణాలు మంజూరు చేయకుండా రైతులకు ఇబ్బంది గురిచేస్తున్న బ్యాంక్ అధికారులు జుక్కల్ మండలం నిజామాబాద్ హెడ్ ఆఫీస్‌కు దూరంగా ఉండటంతో ఉన్నతాధికారులు ఇక్కడికి ఎవరు రారు అనే ధీమతో జుక్కల్ బ్యాంక్ అధికారులు రైతుల భూమి పరిశీలించడానికి వెళ్లిన బ్యాంక్ అధికారులకు రైతులు విందులు ఇస్తున్నారు. విందులు ఇవ్వకపోతే తమకు రుణాలు మంజూరు కావేమో అని ఉద్దేశంతో రైతులు అప్పులు తెచ్చి వారికి కమిషన్లు విందులు ఇచ్చి కర్షక మిత్ర రుణాలు పొందుతున్నామని రైతులు తెలిపినారు వడ్డీ వ్యాపారస్తులు వద్ద అధిక వడ్డీ ఉండడంతో బ్యాంకులో తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడంతో తప్పనిసరి పరిస్థితిలో కమిషన్లు విందులు ఇచ్చి రుణాలు పొందుతున్నామని రైతులు ఆవేదన చెందారు. ఎన్డీసీసీ ఉన్నత బ్యాంక్ అధికారులు విచారణ జరిపి జుక్కల్ బ్యాంక్ అధికారులపై తగు చర్య తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

రైతులకు ఇబ్బంది పెట్టలేదు

జుక్కల్ మండలంలోని వివిధ గ్రామాలలో 2024-25 సంవత్సరంలో సుమారు 40 రైతులకు వారి పంట పొలాల విస్తీర్ణం ఆధారంగా కర్షక మిత్ర రుణాలు మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. రైతులకు రుణాలు మంజూరు చేయడానికి రైతుల వద్ద డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణనలు వస్తున్నాయి. అదే విధంగా డబ్బులు ఇచ్చిన రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారికి ఇబ్బంది పెడుతున్నట్లు విలేకరి మేనేజర్‌ను ప్రశ్నించగా అటువంటి విషయం ఏమి లేవని ఆయన అన్నారు. డబ్బులు తనకు ఎవరూ ఇవ్వలేదని ఆయన తెలిపారు.

- సుధాకర్, ఇన్‌చార్జి మేనేజర్ ఎన్డీసీసీ బ్యాంకు, జుక్కల్

ప్రభుత్వ హోమియో వైద్యశాలకు మందుల వితరణ


హోమియో మందులను అందజేస్తున్న బోధన్ కోర్టు న్యాయమూర్తి

బోధన్‌రూరల్,జూన్18(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ప్రభుత్వ హోమియో వైద్యశాలకు బుధవారం బోధన్ కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి, వై.వీ శ్రీనివాస్ రావు, గుంటూరు మాధవ్ రావు, లక్ష్మణ్ నాయక్‌లు ఉచితంగా మందులను అందజేశారు. సీజన్ వ్యాధులకు అత్యవసర మందులకు గాను ఫార్మాసిస్టు విజయలక్ష్మి అభ్యర్థన మేరకు అత్యవసర పరిస్థితులలో, అనునిత్యం వచ్చే పేషెంట్లకు హోమియో మందులు ఉపయోగపడతాయని విరాళంగా మందులను అందజేసినట్లు కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి తెలిపారు. ప్రజలు ప్రభుత్వ హోమియో మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉన్నారు.

ప్రధానమంత్రి ఆవాసియోజనపై అవగాహన

మోస్రా,జూన్18(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని కారేగావ్, మేడిపల్లి తండాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజనపై బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగోరావ్ మాట్లాడుతూ తండావాసులు ప్రభుత్వంచే గుర్తించబడిన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు కార్డులాంటి గుర్తింపు కార్డులను తీసుకుని వారు తీసుకోవాలని అదే విధంగా ఈ గుర్తింపు కార్డులతో పాటు కులం, ఆదాయం ధ్రువపత్రాలను చేసుకోవాలని ఇవన్నీ పత్రాలు సరిగ్గా ఉంటే ప్రభుత్వం పథకాలకు అర్హులు అవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి ఒక్కరి వద్ద ఈ సంబంధిత ధృవపత్రాలు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్పొరేషన్ అధికారులతో పాటు ఎంపీడీఓ నీలావతి, మండల కార్యాలయాల సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సీతారాం, దుర్గాప్రసాద్, తండా ప్రజలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జక్రాన్‌పల్లి, జూన్18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎండి మాలిక్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని కలిగోట్ గ్రామంలో యువతకు, గ్రామస్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోడ్డు ప్రమాదాలు జాగ్రత్తలు తీసుకోవాలి. రాంగ్‌రూట్లో వెళ్లవద్దని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పోలీస్‌లు, కలిగోట్ గ్రామస్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

భీమ్‌గల్ జూన్18 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని కప్పల వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. బుధవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నందిగల్లీలో ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్లను సంబందించిన పత్రాలను అడగగా ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో వాటిని పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


పొతంగల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

కోటగిరి,జూన్18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న పొతంగల్ తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. పొతంగల్, కోటగిరి మండల కేంద్రాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల కేంద్రాల్లో భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పవన్, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రాక్రే, మాజీ ఎంపీటీసీ విఠల్, అధికారులు మధు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ భూసమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులో రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. అనంతరం దరఖాస్తులను అధికారులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ ప్రవీణ్, తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

ఆర్మూర్ టౌన్, జూన్18 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయితో పాటు సోషల్ మీడియాలో యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేయాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ అన్నారు. బుధవారం పట్టణంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్ గౌడ్,సుమన్, రాకేష్, వినోద్, శ్రీకాంత్, కిశోర్,లక్ష్మణ్, గంగరాజు పాల్గొన్నారు.

ఏడుగురికి ఏడాది సాధారణ జైలుశిక్ష

నిజామాబాద్ లీగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముగ్గురిని తీవ్రంగా గాయపరిచిన 7గురికి ఏడాది సాదారణ జైలుశిక్ష విదిస్తూ నిజామాబాద్ మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్టక్లాస్ మేజిస్ట్రేట్ (ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి) ఖుష్బూ ఉపాధ్యాయ్ బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి... నిజామాబాద్ నగరంలోని ద్వారకానగర్ కు చెందిన ఖాజా బీ కొడుకు సాధిక్, షేక్ హాజీ దగ్గర తన గ్యాస్ సిలిండర్ ను 500 రూపాయలకు కుదువ పెట్టాడు. 7 ఫిబ్రవరి, 2015 న రాత్రి పది గంటలకు హాజీ దగ్గరకు వెళ్లి రూ.500 తీసుకుని గ్యాస్ సిలిండర్ తిరిగి ఇవ్వమని కోరింది. వెయ్యి రూపాయలు ఇస్తేనే సిలిండర్ ఇస్తానని చెప్పగా ఇది ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. రాత్రి రెండున్నర గంటలకు ఖాజా బీని షేక్ హాజీ, షేక్‌ఇజాజ్, అఫ్సర బేగం కట్టెలతో, రాడ్ తో తలపై కొట్టగా ఆమె కూతురు సాయిద బేగం, ఆమె అల్లుడు షేక్ మౌలానాను షేక్ ఖయ్యూమ్, నసీమ, షేక్‌అన్వర్, పర్వీన్ బేగం, షేక్ మక్బూల్ కూడా కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరచ్చినారు. పైనేరారోపణలు కోర్టు నేరన్యాయ విచారణలో రుజువు కావడంతో ముద్దాయిలు షేక్ ఖయ్యూమ్, నసీమ, షేక్ అన్వర్, షేక్‌హాజీ, షేక్‌నయీమ్, షేక్ ఇజాజ్, పర్వీన్ బేగం లకు ఒక్కొక్కరికి ఒక సంవత్సరం సాదారణ జైలుశిక్షతో పాటు మూడు వేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా నెల రోజుల సాదారణ జైలుశిక్ష అనుభవించాలని జడ్జి ఉపాధ్యాయ్ తమ తీర్పులో పేర్కొన్నారు. కోర్టు విచారణ దశలో ఉండగా షేక్ మాక్బుల్ మరణించాడు.

మోర్తాడ్‌లో పరిశుభ్రతపై స్కావెంజర్లకు ఒకరోజున శిక్షణ


ఉపాధ్యాయులకు, స్కావెంజర్లకు శిక్షణ ఇస్తున్న ఎంఈవో సమ్మిరెడ్డి

మోర్తాడ్ , జూన్18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిశుభ్రతలో స్కావెంజర్ల పాత్ర కీలకమని మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి అన్నారు. బుధవారం మండలలోని అన్ని పాఠశాలల పరిశుభ్రతపై ఒక్కరోజుశిక్షణ కార్యక్రమం ఆయనప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల నుండి ఒక ఉపాధ్యాయుడు, స్కావెంజర్లు పాల్గొన్నారు. పా ఠశాలలో మొక్కలకు నీరు అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉం చడం వంటి పనులను నిర్వహించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈ వో సమ్మిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం ప్రభాకర్, డీకే జగదీశ్వర్, వేణుగోపాల్‌రావ్, రఘునందన చారి, శ్రీనివాస్, వేణుగోపాల్, పీఆర్‌పీలు35 మంది స్కావెంజర్లు పాల్గొన్నారు.

నిజాంసాగర్ కెనాల్ కబ్జాకు గురవుతుందని ఆందోళన


సంఘటన స్థలం వద్ద ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ముప్కాల్ , జూన్18 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ కెనాల్ కాలువ రోడ్డు కబ్జాకు గురవుతుందని స్థానికులు ఆందోళన చేశారు. నిత్యం ఈ రోడ్డు నుంచి కాలనీవాసులు వెళ్లకుండా సదరు వ్యక్తి కెనాల్ చుట్టు పక్కల పెరిగిన చెట్లను నరికివేయడంపై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తిపై మండల స్థాయి అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదును ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మత్తు,మాదక ద్రవ్యాలపై గోడప్రతుల ఆవిష్కరణ



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

నిజామాబాద్‌లీగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నేడుయువత మత్తు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని గోడ పత్రాలను న్యాయ సేవ సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జీవీఎన్ భారత లక్ష్మి అన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో గోడపత్రాలను ఆవిష్కరించి మాదక ద్రవ్యాల భారిన పడకుండా తగు జాగ్రత్తలు మరియు పిల్లపైన తల్లి దండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉదయ్ భాస్కర్‌రావు, డీసీపీ బస్వారెడ్డి, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సిర్పూర్ పాఠశాలను పరిశీలించిన అధికారులు



సిర్పూర్ ప్రైమరి ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

డొంకేశ్వర్, జూన్18 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని సిర్పూర్ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలను మండల అధికారులు పరిశీలించారు. ఈనెల 16న ఆంధ్రజ్యోతిలో శిథిలావస్థలో సిర్పూర్ పాఠశాల అనే శీర్షిక ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మూత్రశాలకు వంటగది, పాఠశాల గదులను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ ప్రసాద్, పంచాయితీరాజ్ రాజ్‌కుమార్, రామకృష్ణ, పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి నరేష్, గ్రామస్తులు ప్రదీప్‌రెడ్డి, గోపి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మెండోర , జూన్18 (ఆంధ్రజ్యోతి): పీఎంపీ అసోసియేషన్ మెండోర మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షులు గోపాల్, కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్ (కోడిచర్ల),ఉపాధ్యక్షుడిగా గోపి(సావెల్), సెక్రటరీగా మురళీధర్‌స్వామి (మెండోర), జాయింట్ సెక్రటరీగా నరేష్(కోడిచర్ల), కోశాధికారిగా ప్రభాకర్ (దూదిగాం), సభ్యులుగా అబ్దుల్ భారీ లక్ష్మీనారాయణ, ప్రవీణ్, సలహాదా రులుగా రాజ్‌కుమార్‌గౌడ్, రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు తెలిపారు.ఈకార్యక్రమంలో మండలపీఎంపీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్‌పై నిలిచిన రైలు.. వాహనదారులకు ఇబ్బందులు

బోధన్‌రూరల్,జూన్18(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా రైల్వే ట్రాక్ వద్ద బుధవారం రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ట్రాక్‌పై నిలిచిపోయింది.దీంతోవాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది.బోధన్ నుంచిమున్సిపాలిటీ,తహసీల్దార్, మండల ఆఫీసలకు,రుద్రూర్ వైపు వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.రైలురాకపోకల సమయంలో గేటు వేయబడుతుంది.కానిబుధవారం ముందస్తు సమాచారం లేకుండానే రైలు నిలిచిపోయింది.దీంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కోవాల్సివచ్చింది.

21 నుంచి బోధన్ నుంచి పెద్దపల్లి రైలు పున: ప్రారంభం

బోధన్‌రూరల్,జూన్18(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణం నుంచి ప్రతిరోజు ఉదయం 4:20గంటలకు వెళ్లే పెద్దపల్లి రైలు ఈ నెల 6వ తేది నుంచి కొన్ని కారణాల వల్ల నిలిపివేయడం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. తిరిగి ఈ నెల 21వ తేది నుండి బోధన్ రాకాసిపేట్ రైల్వేస్టేషన్ నుంచి పెద్దపల్లి రైలు పునర్ ప్రారంభం అవుతుందని రైల్వే శాఖ అధికారులు బుధవారం వెల్లడించారు. పెద్దపల్లి, కరీంనగర్ వెళ్లే ప్రయాణికులు 21వ తేది నుంచి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

ఆర్మూర్ టౌన్, జూన్18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రుచికరమైన బోజనం అందించాలని మున్సిపల్ కమీషనర్ రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న బోజనాన్ని తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణ మౌళి, హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడొద్దు

ఆర్మూర్ టౌన్, జూన్18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రజలు సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడవద్దని సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ పరిధిలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, పాఠశాల హెచ్ లక్ష్మీనర్సయ్య, వార్డ్ ఆఫీసర్లు వీణ, రాజేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’లో మహిళలదే అగ్రస్థానం

● కూలీ రేట్లు పెరగడంతో మహిళలకు పెరిగిన ఉత్సాహం
● 2023-24లో ఎక్కువ పని రోజులు వారివే


ఉపాధి హామీ పనులు చేస్తున్న మహిళల దృశ్యం

బోధన్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ కూలీ పనులు మహిళలకు వరంగా మారాయి. మహిళలు ఇంటిని చక్క బెట్టడమే కాకుండా కుటుంబ పోషణకు కావాల్సిన సహాయాన్ని తమ వంతుగా చేస్తున్నారు. అలాగే పురుషులతో సమానంగా వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తాము ఎందులో కూడా తక్కువ కాదని నిరూపిస్తున్నారు. 2023-24 ఏడాది పని దినాలు వినియోగించుకున్న ఉపాధి హామీ కూలీల్లో పురుషుల కంటే మహిళలే ముందు వరుసలో నిలిచారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించిన మొదట్లో పురుషులు ఎక్కువగా పనులకు వెళ్లేది కాని రోజులు గడుస్తున్న కొద్ది ఈ పనుల్లో మహిళలు దూసుకెళ్తున్నారు.మగవారితో సమానంగా పార, గడ్డపార చేతబట్టుకుని పనులు చేస్తున్నారు. మహిళలకు వారి గ్రామాల్లోనే ఉపాధి హామీ పనులు దొరుకుతుండడంతో వారు వ్యవసాయ పనులున్న రోజులు మినహా ఇస్తే మిగతా అన్ని రోజుల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం బోధన్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఉపాధి పనులు నడుస్తున్నాయి.

● కూలీ రేట్లు పెరగడంతో ఉత్సాహం

మన రాష్ట్రంలో ఉపాధి హామీ కూలీ మార్చి 31వరకు 272రూపాయలు చెల్లించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రేటు 28రూపాయలు పెంచింది. దీంతో ఉపాధి కూలీలకు 300రూపాయలు చెల్లిస్తున్నారు. కూలీ రేట్లు పెరగడంతో మహిళలు ఉపాధి హామీ పనులు చేసేందుకు మరింత ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఒక్క కూలీకి వంద రోజుల పనులు కల్పిస్తుంది. కూలీ రేటు పెరగకముందే కొందరు కూలీలు వారికి కేటాయించిన కనీసం వంద రోజుల పనులు కూడా చేసేవారు కాదని, ప్రస్తుతం కూలీ రేటు పెరగడంతో వంద రోజుల కూలీ చేస్తున్నారని ఉపాధి హామీ కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● ఉపాధి హామీ హాజరు విధానం ఇలా


ఉపాధి హామీ ప్రదేశాలలో మొదట కూలీల ముఖ చిత్రాలను అమలు చేస్తారు. తర్వాత కూలీ ఫోటో, అంతకు ముందు దిగిని ఫోటో సరిపోలితేనే వారికి హాజరుపడుతుంది. కూలీలు పని చేసే రోజు ఉదయం, మధ్యాహ్నం కూలీల ముఖ చిత్రీకరణ తప్పకుండా ఉంటుంది. ఈ విధానం ద్వారా ఉపాధి పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఆలోచన. ఈ విధానం త్వరలోనే ఆచరణలోకి వచ్చే అవకాశం ఉంది.

● ఉపాధి హామీలో మహిళలే ముందంజ

-హేమలత, ఏపీవో, బోధన్

ఉపాధి హామీ కూలీల్లో మహిళలే ముందంజలో ఉన్నారని, పురుషుల కంటే ధీటుగా పలుగు, పార పట్టి మహిళలే ఉత్సహంగా పని చేస్తున్నారు. ఇటీవల కాలంలో మహిళలు ప్రతి రోజు పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు వహిస్తున్నాం. బోధన్, సాలూర మండలాల్లో మహిళలే అధిక శాతం ఉపాధి హామీ పనులకు వస్తున్నారు. మహిళల్లో చైతన్యం పెరిగింది.


నిజాంసాగర్ ప్రాజెక్టులో 1393.78 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉన్న దృశ్యం


సాగు గేట్ల ద్వారా తాగునీటి కోసం ప్రధాన కాలువలో నీటిని వదులుతున్న దృశ్యం

నిజామాబాద్, బోధన్

తాగునీటి అవసరాలకు నిజాంసాగర్ నీటి విడుదల

● మూడు రోజుల పాటు 0.35 టీఎంసీల నీటి విడుదల
● ప్రస్తుత నీటి నిల్వ 6.032 టీఎంసీలు

నిజాంసాగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల వరప్రదాయని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి బోధన్, నిజామాబాద్ పట్టణాలకు తాగునీటి అవసరాల కోసం బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టు సాగు గేట్ల ద్వారా ప్రధాన కాలువల్లోకి 1200 క్యూసెక్కుల నీటి చొప్పున విడుదల చేస్తున్నారు. బోధన్, నిజామాబాద్ పట్టణాలకు మూడు రోజుల పాటు తాగునీటి కోసం 0.35 టీఎంసీల నీటిని విడుదల చేయడం జరుగుతుందని ప్రాజెక్టు ముఖ్య కార్య నిర్వాహణ అధికారి సోలోమోన్ తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు గాను 6.032 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్షాకాలం ప్రారంభమై పది రోజులు గడిచినప్పటికీ ఈ ఏడాది వర్షాకాలానికి నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటి ప్రణాళికను ఇప్పటి వరకు ప్రభుత్వం రూపొందించలేక పోయింది. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల సాగునీటి ప్రణాళిక హైదరాబాద్‌లోని శివం సమీక్షా సమావేశంలో సమీక్షించి ప్రాజెక్టుల ప్రణాళికను రూపొందించనున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇంకా పది టీఎంసీల నీటిని 1,35,000 ఎకరాలకు సాగునీరు అందించారు. ఈ ఏడాది వర్షాకాలంలో ప్రాజెక్టులో 6.032 టీఎంసీల నిల్వ ఉంది. బోధన్, నిజా మాబాద్ పట్టణాలకు తాగునీటి కోసం ప్రాజెక్టు నుంచి దాదాపు 0.35 టీఎంసీల నీటిని విడుదల చేస్తారు. ఇప్పటి వానాకాలం సాగు ప్రణాళిక రూపొందించకపోవడంతో ఇంకా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసేది ఎప్పుడోనని రైతాంగం ఎదురు చూస్తోంది. గత వర్షాకాలం జూలై, ఆగస్టు మాసంలో కురిసిన భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటిని వరద గేట్ల ద్వారా దిగువకు 74 టీఎంసీల నుంచి విడుదల చేశారు. వర్షాకాలం ప్రారంభమై పది రోజులు గడుస్తున్నప్పటికీ రైతులు ఇప్పటికే ఆయకట్టు కింద వరి నారుమళ్ళు పోసుకుని వరుణి కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

● హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు


జేసీబీ సహకారంతో హద్దులను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ జాతీయ రహదారి పక్కన గల ఇరి గేషన్ స్థలాన్ని అధికారులు స్వాధీనం పర్చుకొని హద్దులను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నేళ్లుగా డిస్ట్రిబ్యూటరీ కాలువను ఒక రియాల్టర్ కబ్జా చేశారనే ఫిర్యాదు మేరకు మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కలిసి డిస్ట్రిబ్యూటరీ కాలువ ను కొలిచి స్వాధీన పర్చుకుని రెండో రోజు జేసీబీ సహాయంతో హద్దులను ఏర్పాటు చేస్తున్నారు. ఇలాగే మున్సిపల్ పరిధిలో గల ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు. అదే డిస్ట్రిబ్యూటరి కాలువ జాతీయ రహదారికి మరోపక్కన మరికొందరు కబ్జా చేసి షాపులను నిర్వహిస్తున్నారు. ఒకపక్క చూసిన అధి కారులు అదే డిస్ట్రిబ్యూటరి కాలువను మరో పక్కచూసీ చూడనట్లుండడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు.

ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన సీతక్కను హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం రూరల్ నియోజక వర్గం, నిజామాబాద్ జిల్లా గురించి, పార్టీ బలోపేతం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి మంత్రితో ఎమ్మెల్యే చర్చించి నట్లు తెలుస్తుంది.

రానున్న ఎన్నికల్లో
అన్ని స్థానాల్లో బీజేపీ గెలిచేలా చూడాలి

● కార్యకర్తలు సమష్టిగా ఎన్నికలలో కృషి చేయాలి
● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

బోధన్‌రూరల్,జూన్18(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక, సంస్థగల ఎన్నికలలో బీజేపీ పార్టీ అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని, పార్టీ గెలుపుకు పార్టీ గెలుపుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ పాలన 11ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా సంకల్ప సభ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవానికి ఇచ్చిన హామీ ప్రకారం ఈ నెల 29వ తేదిన పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్‌షా వస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కార్యక్రమానికి బోధన్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే వచ్చే మున్సిపల్ ఎన్నికలలో బోధన్ మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగురవేసేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అన్ని వార్డులలో సరైన అభ్యర్థులను నిలబెట్టి పార్టీ అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ సీటును కైవసం చేసుకోవాలన్నారు. అనంతరం ఐఐటీలో ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందించారు. ఆలిండియా లెవెల్‌లో శక్కర్‌నగర్‌కు చెందిన ప్రణయ్ సాయి 279వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రణయ్‌సాయిని ఆదర్శంగా తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కైలేష్, కందకట్ల రాంచందర్, మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, ఇంద్రకిరణ్, సరిన్, బోధన్ పట్టణ పసులోటి గోపి కిషన్, మాజీ అధ్యక్షులు బాలరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజులదేవి పవన్ కుమార్, ఉపాధ్యక్షులు యోగిరాజు, గౌతం గౌడ్, లింగంలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్: పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కిసాన్ మోర్చ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు కేటాయించి కార్యాలయ ప్రారంభోత్సవానికి వస్తున్న అమిత్‌షాకు ఘన స్వాగతం పలకాలని ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ పసుపు రైతులకు పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పసుపు బోర్డు ఏర్పా టు చేయడం జరిగిందన్నారు. బోర్డు ఏర్పాటు చేయడమే కాకుండా బోర్డుకు జాతీయ చైర్మన్‌ను జిల్లా రైతు కుటుంబానికి చెందిన పల్లె గంగారెడ్డిని చైర్మన్‌గా నియమించడం జరిగిందన్నారు. కేంద్ర కార్యాలయాన్ని కూడా జిల్లాలోనే ఏర్పాటు చేశామని తెలిపారు.

సీపీ ఆదేశాలు బేఖాతర్

● నెంబర్ ప్లేట్ లేకుండా జోరుగా ఇసుక అక్రమ రవాణా


నెంబర్ ప్లేట్ లేని వాహనంలో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

రెంజల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుకను ఉక్కుపాదం మోపాలని సీపీ సాయి చైతన్య ఆదేశాలను తుంగలో తొక్కుతూ అక్రమ మార్గంలో ఇసుక రవాణాను పాల్పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు అందించాల్సిన ఇసుక లబ్దిదారుల పేరిట అక్రమ రవాణా చేస్తూ అధిక డబ్బులు దండుకుంటున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ ముందు పదుల సంఖ్యలో నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తున్న పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమ ఇసుకను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రెంజల్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ 24గంటలు గడవక ముందే పోలీస్ స్టేషన్ ముందు నుండి ఇసుకను తరలించడంలో అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుకను అందజేస్తుండగా అదే ఆసరాగా చేసుకుని స్థానిక ఇసుక వ్యాపారులు ధనార్జన ధ్యేయంగా లబ్దిదారుల కళ్లు గప్పి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. కళ్ల ముందే నుండే అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో లబ్దిదారులకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. ఇకనైన ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

వారం రోజుల్లో టీయూలో హాస్టల్‌కు భూమిపూజ

● టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ. యాదగిరి రావు


టీయూలో పరిపాలన భవనంలో మాట్లాడుతున్న వీసీ యాదగిరి రావు

డిచ్‌పల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో గిరిజన బాలుర, గిరిజన బాలికలకు హస్టళ్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం గిరిజన శాఖ ద్వారా ఒక్కో హస్టల్ నిర్మాణానికి రూ.10కోట్లు ఇటీవల మంజూరు అయ్యాయని త్వరలోనే ఈ హస్టళ్ల నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. యాదగిరి రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... బాలుర, బాలికల హస్టళ్ల నిర్మాణానికి టెండర్‌లు పూర్తి అయ్యాయని ఇందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హస్టల్ నిర్మాణానికి వర్సిటీలో స్థల ఏర్పాటుకు సహకరిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా రూసా ద్వారా బాలికల హస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని వారం రోజుల్లో భూమి పూజ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వీసీ తెలిపారు. ఇండోర్ షటిల్ కోర్టు నిర్మాణంకు రూ.1.30కోట్లు మంజూరు అయ్యాయని, బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణంకు 40లక్షలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు.

స్నాతకోత్సవం ఏర్పాట్లపై అధికారులతో వీసీ సమీక్ష

తెలంగాణ యూనివర్సిటీలో వచ్చే నెలలో జరిగే టీయూ స్నాతకోత్సవం ఏర్పాట్లపై వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు బుధవారం వర్సిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్నాతకోత్సవం ఏర్పాటుపై తీసుకోవాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్య అతిథిగా వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలు హాజరుఅవుతున్నందున తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. 132 బంగారు పతకాలు, 75 మంది పీహెచ్‌డీ అవార్డులు అందజేస్తున్నట్లు వీసీ ప్రకటించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ యాదగిరి, సీవోఈ సంపత్ కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య, పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగుపడిన ఉత్తీర్ణత

● నిల్ రిజల్ట్ నుంచి 40 శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాల ● 35 మందికి 14 మంది విద్యార్థుల ఉత్తీర్ణత

నాగిరెడ్డిపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో నిల్ రిజల్ట్‌కే పరిమితమైన నాగిరెడ్డి పేట ప్రభుత్వ జూ నియర్ కళాశాల ఇటీవల నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాత్రం 40 శాతం ఉత్తీర్ణత సాధించించింది. కళాశాలలో ఉత్తీర్ణత శాతం మెరుగుపడింది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఈ కళాశాలకు చెందిన 35 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా, అందులో 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై నట్టు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. బైపిసి గ్రూపులో 14 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా తొమ్మిది మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు, ఎంపీసీ గ్రూపులో ఒక విద్యార్థి పరీక్ష రాయగా ఉత్తీర్ణులైనట్టు, హెచ్‌ఈసి గ్రూపులో నలుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో, ప్రభుత్వం జూనియర్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో 2024-25 విద్యా సంవత్సరంలో కళాశాలను ప్రారంభించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకున్నారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఈ నూతన కళాశాల వివిధ గ్రూప్‌లకు చెందిన 45 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాయగా అందులో మొత్తం మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దీంతో మొట్ట మొదటిసారే ఇంటర్ పరీక్షల్లో ఈ కళాశాల నిల్ రిజల్ట్‌కు పరిమితమై జిల్లావ్యాప్తంగా ఉత్తీర్ణత సాధించడంలో పూర్తిగా వెనుకబడింది. ఇంటర్ వార్షిక పరీక్షల్లో నిల్ రిజల్ట్‌కు పరిమితమైన ఈ కళాశాల అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాత్రం వివిధ గ్రూపులకు చెందిన 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ కళాశాలలో ఉత్తీర్ణత శాతం మెరుగుపడటం పట్ల విద్యార్థులతో పాటు, విద్యార్థుల తల్లి దండ్రులు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తున్నారు.



నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇదే..

● లెక్చరర్ల నియామకంతో ఫస్టియర్‌లో ఉత్సాహంగా అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుత 2024-25 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవ త్సరంలో అడ్మిషన్లు తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. గత సంవత్సరం ఇద్దరూ లెక్చరర్‌తో మాత్రమే కొనసాగిన ఈ కళాశాలలో, లెక్చరర్ల కొరతతో విద్యార్థులకు సరైన విద్య బోధన జరగక, ఉత్తీర్ణత సాధిం చడంలో పూర్తిగా వెనుకబడటంతో, ఈ కళాశాలలో లెక్చరర్లల్లోనూ నియమించడంపై, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకుగాను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం ప్రత్యేక దృష్టి సారించారు. కళాశాలలో 11 మంది లెక్చరర్లకు గాను ప్రస్తుతం 9 మంది కొత్త లెక్చరర్‌లను నియామకం చేశారు. మరో ఇద్దరూ కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్లు కూడా కళాశాలకు త్వరలో రానున్నట్టు కళాశాల లెక్చరర్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాలలో తగినంత మంది లెక్చరర్ల నియామకం జరగడంతో, ఇటీవల జరిగిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు 40 శాతం ఉత్తీర్ణత సాధించడంతో, ఈ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపిసి, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడి యం, తెలుగు మీడియంల ద్వారా ఉత్తమమైన విద్యా బోధన జరు గనుండడంతో విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకునేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

రాష్ట్ర చీఫ్ సెక్రెటరీని కలిసిన టీఎన్‌జీవోస్ నాయకులు



చీఫ్ సెక్రెటరీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

సుభాష్‌నగర్,జూన్ 18 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామ కృష్ణా రావును టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు ఉద్యోగుల సమస్యలపై విన్న వించారు. హైదరాబాద్‌లోని చీఫ్ సెక్రెటరీ కార్యాలయంలో రామ కృష్ణారావును కలిసి ఉద్యోగుల సమస్యలు తదితర విషయాలపై చర్చిం చారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ మాట్లా డుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై నిర్ణయిం చిన ప్రకారంగా ఆర్థికేతర అంశాల అమలు ప్రక్రియను వేగవంతం చే యాలని కోరారు. ఉద్యోగుల హెల్త్‌స్కీమ్ కొరకు పునఃర్వ్యవస్థీకరణ కమి టీని వెంటనే వేయాలని తెలిపారు. ఆర్థిక అంశాల్లో భాగంగా ప్రతీనెల 700 కోట్ల పెండింగ్ బిల్లులు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్‌జీవోస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో బ్యాంకును తీసుకురావడం హర్షనీయం



ఉద్యోగులకు జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకును ధీనస్థితి నుంచి లాభాల బాటలోకి తీసుకురావడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ రమేస్‌రెడ్డి అన్నారు. బుధవారం బ్యాంకు వార్షిక సమావేశం నిర్వహించారు. 2024-25లో బ్యాంకు ఫలితాలు గొప్పగా ఉన్నాయని ధీనస్థితి నుంచి మంచి స్థితికి బ్యాంకు వచ్చిందన్నారు. బ్రాంచ్‌ల వారిగా సమీక్షించారు. ఎన్‌పీఏ ఇంకా గణనీయంగా తగ్గించాలని గృహ, తార, స్వర్ణ, రత్న, రికవరీలలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు జ్ఞాపికలతో పాటు నగదు బహుమతి అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఇదే ఫలితాలు వచ్చేలా ప్రతి ఉద్యోగి నిర్దేశిత పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారి నాగభూషణం, వసంత, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబరేటరీ ప్రారంభం



ల్యాబరేటరిని ప్రారంభిస్తున్న ఎంఈవో సాయిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):కస్బాగల్లిలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబరేటరిని బుధవారం నిజామాబాద్ సౌత్ ఎంఈవో సాయిరెడ్డి ప్రారంభించారు. ఈ సైన్స్ ల్యాబరేటరి వల్ల విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తితో పాటు పలు విషయాలలో అవగాహన వస్తుందని ఆయన అన్నారు. ఈ సైన్స్ ల్యాబరేటరి ఏర్పాటు చేసిన రాంజీ రాఘవన్‌ను అభినందించారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా 11 ఏళ్ల మోదీ పాలన



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదరికం నిర్మూలనే లక్ష్యంగా 11 ఏళ్ల మోదీ పాలన జరిగిందని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామియాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 48వ డివిజన్‌లోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో బుధవారం బీడీ ప్యాకింగ్ కార్మికులతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాస స్వామి యాదవ్ హాజరై మాట్లాడారు. సామాన్య ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడం కోసం ప్రధాన మంత్రి మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల నుంచి మోదీకి బీజేపీ ప్రభుత్వానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఎంతో మంది కార్మికులకు నేరుగా లబ్ధిచేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మెట్టు విజయ్‌కుమార్, పడాల భూపతి, రామచందర్, బంగారు శ్రీనివాస్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

కోతులను కొట్టబోయి విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మృతుడు భగవన్‌లాల్

ఇందల్వాయి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తన ఇంటి వద్ద ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తుండగా కోతులు గుంపుగా రావడంతో కోతులను కొట్టబోయి విద్యుత్ షాక్‌తో ఓ ఒకరి మృతి చెందిన ఘటన ఇందల్వాయిలో చోటు చేసుకుంది. రాజస్థాన్ నుండి బతుకుదెరువు కోసం ఇందల్వాయికి వచ్చిన భగవన్‌లాల్ చార్డ్ గంగారాం తాండాలో అద్దెకు ఉంటూ ఐస్ క్రీమ్‌లు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు వారి పనిలో భాగంగా బుధవారం ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న క్రమంలో కోతులు గుంపులుగా తన ఇంటిపైకి రావడంతో ఐరన్‌పైప్ తీసుకొని ఇంటిపైకి వెళ్లి కోతులను కొట్టే క్రమంలో 11కెవి కరెంటు తీగలకు తగిలి అక్కడి కక్కడే మృతి చెందినట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు.భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గిరిరాజ్ కళాశాల ఫలితాలు విడుదల

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):ఏప్రిల్, మే 2025లో నిర్వహించిన గిరిరాజ్ కళాశాల 2, 4, 6 సెమిస్టర్ రెగ్యూలర్, 1, 3, 5 బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి సంపత్‌కుమార్, శాంతాబాయి, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఫలితాలను విడుదల చేశారు. యూజీ ఫైనలియర్ ఫలితాలలో 82.47 శాతం ఉత్తీర్ణత, 4వ సెమిస్టర్‌లో 50.97 శాతం ఉత్తీర్ణత, 2వ సెమిస్టర్‌లో 42.39 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో చూడాలని ప్రిన్సిపల్ తెలిపారు.

● విద్యాబోధన రంగంలో అవకాశాలపై సెమినార్

గిరిరాజ్ కళాశాలలో పీజీ పూర్తయిన తర్వాత విద్యాబోధనలో గల అవకాశాల గురించి పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఎం ఐఐటి ఫౌండేషన్ స్థాపకుడు వల్లభరావు విద్యార్థులకు పలు మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పిచ్చి కుక్కల స్వైర విహారం

● 13 మందికి గాయాలు ● ఇద్దరిని జిల్లా ఆసుపత్రికి తరలింపు



గాయపడ్డ బాలుడికి చికిత్సలు చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్పల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో పిచ్చి కుక్కలు బుధవారం స్వైర విహారం చేశాయి. రెండు గ్రామాల్లో 13 మందిని గాయపర్చగా ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిచ్చి కుక్కల దాడిలో ఎక్కువ మంది చిన్నారులే ఉండటంతో రెండు గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ధర్పల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో పిచ్చికుక్కలు గ్రామస్తులను గాయపర్చాయి. గాయపడ్డ వారిలో శ్రీనాథ్, సుజాత, వరుణ్, హర్షిత్, రాజేశ్వర్, సయ్యద్ రిహాన్, అజయ్, ఆలెపు నరేందర్, రిత్విక్‌రెడ్డి, దీప్‌చరణ్‌రెడ్డి, రాకేష్, భాగ్య, రమాదేవి, సన్నిలు ఉన్నారు. దమ్మన్నపేటలో జరిగిన పిచ్చి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు మొఖంపై తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మండల కేంద్రం లోగల కొత్త, పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పిచ్చి కుక్కలు గ్రామస్తులను టార్గెట్‌గా చేసుకొని గాయపర్చాయి. వీరందరికి మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు నిర్వహించి కుక్కకాటు వ్యాక్సిన్ వేశారు. గ్రామంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. కుక్కలబెడదను అరికట్టాలని రెండు గ్రామాల గ్రామస్తులు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన పలువు నేతలు, అధికారులు



కలెక్టర్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు



కలెక్టర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమాండెంట్

నిజామాబాద్ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):నూతన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని ఉమ్మడిజిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్ విజయరామారావు మర్యాధపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో సహాయ కమీషనర్‌తో పాటు వివిద దేవాలయాల అర్చకులు, కార్య నిర్వాహణ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అర్చకులు కలెక్టర్‌కు వేద మంత్రాలతో ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల, కార్యనిర్వాహణ అధికారులు శ్రీరాం రవీందర్‌గుప్త, వేణు, అర్చకులు మాణిక్యశర్మ, చంద్రశేఖర్‌శర్మ, నీలేష్‌శర్మ, జైరాజ్ జోషి, జూనియర్ అసిస్టెంట్లు ప్రశాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నవీపేట: నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ జే.రాంచందర్ బుధవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవీపేట మండలంలో సాగు చేస్తున్న పంటల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారని ఏఎంసీ వైస్ చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టి పోశెట్టి తదితరులున్నారు.

డిచ్‌పల్లి:ఏడోబెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ, నిజామాబాద్ జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ వినయ్ కృష్ణ రెడ్డిని బుధవారం మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిజామాబాద్ అర్బన్:నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్‌కృష్ణారెడ్డిని బుధవారం పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కలెక్టర్‌ను కలిసి శాలువ, బుకేతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా స్థితిగతులపై చర్చించి నగర అభివృద్ధిపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్‌ను కోరారు. పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, డీఎంవో గంగుబాయి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ అపర్ణ, గ్రేడ్-2 సెక్రెటరీ శ్రీధర్ తదితరులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మాదిగ ఉద్యోగుల సమైక్య ప్రతినిధులు నూతన కలెక్టర్‌ను కలిశారు. పదోన్నతులు, విద్యారంగంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నూత్‌పల్లి మారుతి, తెడ్డు గంగారాం, నాంపల్లి, సిలుమల సురేష్, తదితరులు ఉన్నారు.

చీమన్‌పల్లిలో ముఖ్యమంత్రి , ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం,ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ జూన్ 18 (ఆంధ్రజ్యోతి):రైతులు పంటలు సాగు చేసే సమయానికే ప్రభుత్వం రైతు భరోసా పథకంలో పెట్టుబడి సహాయాన్ని విడుదల చేసినందున సిరికొండ మండలం చీమన్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. చీమన్‌పల్లి గ్రామంలో ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేసిన అనంతరం మాజీ సర్పంచ్ జితేందర్‌సింగ్ మాట్లాడుతూ రైతులు పంటలు సాగుచేయడానికి సిద్ధపడుతున్న సమయంలో రైతుభరోసా పతకంలో పెట్టుబడి సహాయం కింద నిధులు విడుదల చేయడం రైతులకు ఎంతో మేలు చేసినట్లు అయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పక్షపాతి అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వమన్నారు. మొదటి విడతగా చీమన్‌పల్లి,జినిగ్యాల, తాటిపల్లి, పందిమడుగు, దూప్యతండా గ్రామాలకు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి 80 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లాకార్యదర్శి చందర్ నాయక్,మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, రాజరెడ్డి, ప్రవీణ్,నందిలాల్, నరేష్ తోపాటు కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గోపు మోహన్‌కు దళితరత్న అవార్డు

సుభాష్‌నగర్,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర మాల సంఘం అధ్యక్షుడు గోపుమోహన్‌కు దళితరత్న అవార్డు లభించింది.హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో గల సూ ర్యలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో గోపు మోహన్‌కు అంబేద్కర్ జయంతిఉత్సవాల కమిటీ చైర్మన్ చెరుకు రాంచందర్ అవార్డును అందజేశారు. గోపుమోహన్‌కు అవార్డు రావడం పట్ల మాలసంఘం సభ్యులు బండిపోశెట్టి, గోపు మురళి, సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపు మోహన్ మా ట్లాడుతూ జిల్లాలో మాలల అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. అవార్డు ఇచ్చిన అంబేద్కర్ ఉత్సవాల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త భవనంలోకి మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి మార్చాలి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన మాతా శిశు ప్రభుత్వ ఆసుపత్రి భవనంకు మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో ప్రారంభమైన భవనం 2022నాటికి పూర్తయ్యిందని ఇప్పటి వరకు భవనంలోకి మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని మార్చక పోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.గ్రామాల నుంచి వచ్చే వారికి అనువుగా ఉంటుందని వెంటనే కలెక్టర్ చొరవచూపి నూతనభవనంలోకి మార్చాలని అన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకే సమ్మె

నిజామాబాద్‌కల్చరల్,జూన్ 18 (ఆంధ్రజ్యోతి):కార్మిక వర్గంపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకే జూలై 9నదేశవ్యాప్త సమ్మె ప్రజాసంఘాలు చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ నాయకులతో కలిసి సార్వత్రిక సమ్మెబుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశం లో కార్మికవర్గంపై దాడి తీవ్రమైందని కార్మికులంతా ఏకతాటిపై వచ్చి సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో సీఐటీయూ రాష్ట్రఉపాధ్యక్షుడు, నూర్జహాన్,శంకర్‌గౌడ్,గంగాధర్, నన్నేసాబ్, పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై దాడి కుట్రలో భాగమే

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకోసం చేపట్టిన ర్యాలీలో జరిగిన సంఘటన కుట్రలో భాగమేనని ఆర్‌ఎంపీ, పీఎంపీల నాయకులు ఆరోపించారు. బుధవారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 16న నగరంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుండగా జరిగిన సంఘటన తమను ఆందోళన కలిగించిం దన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తమలోని ఐక్యతను చూసి ఓర్వలేని కొందరు కుట్రలో భాగంగానే మహిళను రెచ్చగొట్టి తమపై ఉసిగొలిపారని ఆరోపించారు. డిచ్‌పల్లి ఆర్‌ఎంపీ వైద్యుడు అశోక్‌పై మహిళ దాడి చేయడం హేయమైన చర్య అని దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డాక్టర్ అశోక్‌కు తమ మద్దతు ఉంటుందని ఈ విష యమై సీపీకి ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో బోధన్ ఆర్‌ఎంపీ, పీఎం పీల అధ్యక్షుడు రాజాగోపాల్ చారీ, శ్రీనివాస్, చందు, సాయిలు, పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని వినతి

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతి నిధులు బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్‌కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా కేంద్రం లో జర్నలిస్టులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇళ్లు, ఇళ్ల స్థలాల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, రాంచందర్ రెడ్డి, వెంకటేశ్, అనిత, పరమేశ్వర్, మధు, రాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 2025 విద్యాసంవత్సరానికి స్ప్రింగ్ సీజన్ కొరకు తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే మైనార్టీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్ పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ ఇంచార్జి అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేందుకు, పీజీలో 60 శాతం మార్కులు వచ్చి పీహెచ్‌డీ చేయాలనుకునే ముస్లీం, క్రిస్టియన్, సిక్, జైన్, బుద్దిస్ట్, పార్సీలు జనవరి 1, 2025 నుంచి 30 జూన్ 2025 వరకు ఎంపిక చేసిన విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్‌లు పొందిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హతలు ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో జూన్ 1 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకొని 31వ తేదీలోపు దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్‌లోని 2వ అంతస్తు రూమ్ నెంబర్ 221లో అందజేయాలని ఆయన కోరారు.

ఒంటికి.. రెంటికి బయటకే!

(ఐదో పేజీ తరువాయి)

ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మొత్తం 500 మంది విద్యార్థులకు ఒక్కటే మరుగుదొడ్డి ఉండటం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రాజెక్టుల పేరుతో, సంక్షేమ పథకాల పేరుతో వేలాది రూపాయలు ఖర్చు చేశామని చెబుతున్న ప్రభుత్వాలు భవిష్యత్తు తరాలను తయారు చేసే ప్రభుత్వ పాఠశాలల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ పాఠశాలలోనే ఈ పరిస్థితి ఉంటే మారుమూల గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థమవుతోంది. సారంగపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న మూత్రశాలలను హైస్కూల్ విద్యార్థులు వినియోగిస్తుండగా, హైస్కూల్‌లో ఉన్న ఒకే ఒక్క మరుగుదొడ్డిని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు వినియోగిస్తున్నారు. 2022లో బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పాత వాటిని కూల్చివేసి కొత్త వాటిని నిర్మించే క్రమంలో ప్రభుత్వం మారడంతో మన ఊరు మన బడి పథకం నిలిచిపోయింది. దీంతో పనులు ఆగిపోయి కేవలం స్లాబ్ మాత్రమే వేసి కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. మళ్లీ అమ్మ ఆదర్శ పాఠశాల కింద 11లక్షలు బాత్‌రూమ్‌లు, తాగునీటి అవసరాలకు మంజూరైనా ఇంకా పనులు మాత్రం పూర్తికాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాగునీటి కులాయిలు లేక ట్యాంకర్ వద్ద విద్యార్థులు నానా ఇబ్బందులను పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో బాత్‌రూమ్‌ల నిర్మాణానికి 5లక్షల 80 వేలు మంజూరైనా ఇప్పటికి పనులు మాత్రం ప్రారంభం కాలేదు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా ఉర్దూ మీడియం పాఠశాలలోనూ పరిస్థితి అధ్వానంగా ఉంది. 300లకు పైగా విద్యార్థులు ఉంటే బాలికలకు ఒక బాత్‌రూమ్, బాలురకు రెండు బాత్‌రూమ్‌లు ఉన్నాయి. బాలురకు సంబంధించిన బాత్‌రూమ్ శిథిలావస్థలో ఉంది.

● నిలిచిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు..

గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మనబడి కింద 405 స్కూళ్లలో 28 కోట్ల 44లక్షలతో వివిధ పనులు చేపట్టగా ఇంకా 10కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాల కింద జిల్లాలో 760 పాఠశాలల్లో 42 కోట్ల 15లక్షలతో వివిధ పనులు చేపట్టారు. కానీ ఇప్పటి వరకు 21కోట్ల 98లక్షల బిల్లులు మాత్రమే వచ్చాయి. దీంతో చాలా చోట్ల పనులను మధ్యలోనే నిలిపివేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల మూత్రశాలలు, మరుగుదొడ్లు మధ్యలోనే పనులను ఆపివేశారు. జిల్లా వ్యాప్తంగా 687 పాఠశాలల్లో కేవలం బాలురకు సంబంధించిన టాయిలెట్లు ఉండగా 741 పాఠశాలల్లో బాలికలకు సంబంధించిన టాయిలెట్లు ఉన్నాయి. 29 పాఠశాలల్లో అసలు టాయిలెట్లే లేవు.

పనులు పురోగతిలో ఉన్నాయి: అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

సారంగపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు సక్రమంగా లేవనే విషయం మా దృష్టికి వచ్చింది. మన ఊరు మన బడి కింద పనులు ప్రారంభమై కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను నిలిపివేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద 11లక్షలు ఉన్నత పాఠశాలకు, 5లక్షల 80వేలు ప్రాథమిక పాఠశాలకు మంజూరు అయ్యాయి. పనులు పురోగతిలో ఉన్నాయి. వేగంగా పనులను చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం.

మోపాల్ సొసైటీలో ఇష్టారాజ్యం!

(ఐదో పేజీ తరువాయి)

తప్పులుఇప్పుడిప్పుడే బయటపడటంతోపీవో,చైర్మన్‌లు ఆశ్చర్యపోతున్నారు. ఈవిషయంపై ఉన్నతాధికారులు కూడా దృష్టి పెడితే బాగుంటుం దని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.గతపాలకులు తమస్వా ర్థం కోసమే గ్రామాల్లో గోదాంలు నిర్మించారని విమర్శలు వస్తున్నాయి.ఒక్కొక్క గోదాంకు సుమారు రూ.20లక్షల వరకు ఖర్చు పెట్టారు. ఈగోదాంలు వృథాగా ఉన్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. రైతులకు ఈసంవత్సర మైనా ఎల్‌టీరుణాలు ఇవ్వాలని పలుగ్రామాలరైతులు అధికారులను కోరుతున్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపాలి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరి, చెరకు, వివిధ రకాల పంటలు పండిస్తున్న రైతుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు భూమయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం ఎన్నో సమస్యలతో పోరాడుతుందని సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బస్సీ, సాయిలు, గంగాధర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచిప్పలో రెండు మెడికల్ షాపులు సీజ్

మోపాల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మంచిప్ప గ్రామంలో నడుపుతున్న రెండు మెడికల్ షాపులను బుధవారం డీఎంహెచ్‌వో రాజశ్రీ ఆకస్మికంగా దాడి చేసి సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వీరివెంట మోపాల్ పోలీసులు కూడా ఉన్నారు.

దోస్త్ డిగ్రీ ప్రత్యేక కేటగిరి విద్యార్థుల సర్టిఫికేట్‌ల పరిశీలన

డిచ్‌పల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశానికి 2025-26 సంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల సర్టిఫికేట్ పరిశీలన బుధవారం వర్సిటీ పరిపాలన భవనంలో జరిగింది ప్రత్యేక కేటగిరి ఎన్‌సీసీ-6, స్పోర్ట్స్-3, సీఏపీ-3 మొత్తం 12 మంది విద్యార్థుల సర్టిఫికేట్ పరిశీలనకు హాజర య్యారని దోస్త్ కోఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. ఈ పరిశీలన లో ఎన్ఎస్ఎస్ అధికారి రామస్వామి, ఫిజికల్ డైరెక్టర్ డా.నేతా, టెక్నికల్ అసిస్టెంట్ నరేశ్, రవీందర్ నాయక్, పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో చిన్నారులకు అక్షరభ్యాసం

ఏర్గట్ల(కమ్మర్‌పల్లి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యాక్రమంలో భాగంగా అక్షరభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, మండల సూపర్‌వైజర్ గంగహంస, మండల స్థాయి అధికారులు, విడిసి సభ్యులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.115	రూ.200	రూ. 230
వెన్‌కాబ్(కిలో)	రూ.120	రూ.210	రూ. 240





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,800	రూ.91,200	రూ.1090

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (తెలుగు 3డి) (11.00, 1.45, 4.30)
: హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (ఇంగ్లీష్ 3డి) (7.15, 10.00)
స్ర్కీన్-2 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (10.10, 4.25)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (1.40)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (ఇంగ్లీష్) (7.55, 10.40)
స్ర్కీన్-3 : అందాల రాక్షసి (10.40)
: ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (1.50)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (4.20)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (7.05, 10.35)
స్ర్కీన్-4 : ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (10.50)
: అందాల రాక్షసి (1.35, 7.35, 10.45)
: ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (5.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : తొలిప్రేమ (11.00, 1.30, 4.30, 7.30, 10.30)
స్ర్కీన్-2 : అందాల రాక్షసి (4.30)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (1.35, 7.30, 10.30)
స్ర్కీన్-3 : అందాల రాక్షసి (10.20)

దేవి : తొలిప్రేమ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : అందాల రాక్షసి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హౌజ్‌ఫుల్-5 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్